రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా రామకృష్ణ

మండలంలోని చిట్టవరం హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆకన రామకృష్ణ రాష్ట్ర ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫామ్ రాష్ట్ర కార్యదర్శి దేవరపు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 24వ తేదీ సాంఘిక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకుని రామకృష్ణకు ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా విజయనగరంలో ఈ అవార్డు అందుకోనున్నారు. 2002లో ఉద్యోగంలో చేరిన రామకృష్ణ ఉత్తమ బోధనతో పాటు, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దటంలో, సాంఘిక శాస్త్ర విషయాలను వ్యాప్తి చేయడంలో ఆయన కృషి, పట్టుదలను గుర్తించే సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. ఈయనకు అవార్డ్ రావడం పట్ల పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మీ చావు.. మీరు చావండి..!

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 'న్యూరో' సేవలకు తిలోదకాలు

ప్రజల ఆరోగ్యంతో పాలకుల చెలగాటం

సర్వజన ఆసుపత్రిలో ఉన్న ఒక్క న్యూరో డాక్టర్ బదిలీ

రెండు జిల్లాల్లో ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ న్యూరో డాక్టర్ లేని వైనం

నరాల రోగులు, రోడ్డు ప్రమాద కేసులన్నీ సర్వజన ఆసుపత్రికే

ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే వందల న్యూరో కేసుల పరిస్థితి ఏమిటి?

న్యూరో సర్జన్ రాకపోవడంతో రోగుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజల ఆరోగ్యం కోసం పట్టించుకునే పాలకులుగానీ, అధికారులుగానీ లేకుండా పోయారు. పేదల ప్రాణాలను గడ్డిపరకలా భావిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు అత్యధికంగా ఎదుర్కొంటున్న సమస్యల్లో న్యూరో (నరాలకు) సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో మినహా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ న్యూరో డాక్టర్ లేని పరిస్థితి. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఏలూరు సర్వజన ఆసుపత్రికి నరాల సంబంధిత రోగుల ప్రతి రోజు వందల సంఖ్యలో వస్తుంటారు. ఏలూరు జిల్లా ఆసుపత్రి సర్వజన ఆసుపత్రిగా మారడంతో వైద్యవిధాన పరిషత్ నుంచి పనిచేస్తున్న సీనియర్ డాక్టర్లను బదిలీ చేసిన పరిస్థితి నెలకొంది. గతంలోనూ ఇదే పరిస్థితి నెలకొనప్పుడు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జోక్యం చేసుకుని సీనియర్ డాక్టర్లను ఇక్కడే సేవలు అందించేలా ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఇప్పుడు మాత్రం అందుకు విరుద్ధంగా పరిస్థితి తయారైంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఒకే ఒక్క న్యూరో డాక్టర్ రవికుమార్ పనిచేస్తున్నారు. సర్వజన ఆసుపత్రిగా మారినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకూ ఇక్కడ న్యూరో సర్జన్‌ను నియమించలేదు. దీంతో డాక్టర్ రవికుమార్ నరాల సంబంధిత కేసులన్నీ చూస్తున్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి న్యూరో విభాగంలో ప్రతిరోజూ 80 మందికిపైగా రోగులు ఓపి సేవలు పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా, తలకు గాయాలైతే ఏలూరు సర్వజన ఆసుపత్రికే రిఫర్ చేస్తారు. ప్రతిరోజూ ఐదు నుంచి ఆరు కేసులు తలకు గాయాలకు సంబంధించి కేసులు సర్వజన ఆసుపత్రికి వస్తుంటాయి. తల నరాలు, కీళ్ల నరాలకు సంబంధించిన వందల మంది రోగులు సర్వజన ఆసుపత్రికి వస్తున్న పరిస్థితి. హఠాత్తుగా ఇక్కడ పనిచేస్తున్న న్యూరో డాక్టర్ రవికుమార్‌ను చింతలపూడి బదిలీ చేసేశారు. దీంతో న్యూరో డాక్టర్ లేక శనివారం ఆసుపత్రులకు వచ్చిన రోగులకు ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో 50 వరకూ సిటీస్కాన్, 30 వరకూ ఎంఆర్ఐ స్కానింగ్‌లు జరుగుతుంటాయి. వీటిలో తల (హెడ్), ఇతర నరాల సంబంధిత రోగులకు సంబంధించిన స్కానింగ్‌లు 15 నుంచి 20 వరకూ ఉంటాయి. దీన్నిబట్టి న్యూరో రోగుల తాకిడి ఏలూరు సర్వజన ఆసుపత్రికి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా ఆసుపత్రిని సర్వజన ఆసుపత్రిగా మార్చిన తర్వాత ఇక్కడకు వచ్చే ఆసుపత్రి పర్యవేక్షణ అధికారులు తీసుకునే నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతూనే ఉన్నాయి.



న్యూరో డాక్టర్ బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

వేరే డాక్టర్‌ను నియమించకుండా.. ఉన్న డాక్టర్‌ను పంపేస్తే ఎలా..

ఏలూరు సర్వజన ఆసుపత్రిలో ఇద్దరు న్యూరో డాక్టర్లు అవసరం ఉంది. అత్యధికంగా న్యూరో కేసులు ఆసుపత్రికి వస్తున్నాయి. ఇప్పటివరకూ ఒకరే డాక్టర్ ఉండడంతో అత్యవసర కేసులు విజయవాడకు రిఫర్ చేయడం జరుగుతోంది. ఇప్పుడున్న ఒక్క డాక్టర్‌ను పంపేసిన పరిస్థితి నెలకొంది. వేరే డాక్టర్‌ను నియమించకుండా ఉన్న డాక్టర్‌ను పంపేస్తే రోగులు పరిస్థితి ఏంటో పాలకులుగానీ, అధికారులుగానీ ఏమాత్రం ఆలోచన చేయని పరిస్థితి నెలకొంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో గుండె, కిడ్నీ, ఊపరితిత్తులు వంటి కీలక రోగాలకు సంబంధించిన డాక్టర్లు లేకుండా పోయారు. ఇప్పుడు న్యూరో డాక్టర్‌ను సైతం పంపేయడంతో రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జనరల్ సర్జన్‌కు న్యూరో రోగులను అప్పగిస్తే రోగం ఏ విధంగా తగ్గుతుందో పాలకులు, ఉన్నతాధికారులే చెప్పాల్సి ఉంది. ఏలూరు సర్వజన ఆసుపత్రిని దారిలో పెట్టడం, రోగులకు మరిన్ని సేవలందించడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేరే డాక్టర్ వచ్చే వరకూ ప్రస్తుతం ఉన్న డాక్టర్ రవికుమార్‌ను కొనసాగించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజల ఆరోగ్యం గురించి పట్టించుకుని చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

చేతి నరాల సమస్యతో వచ్చాను..

పుష్పవతి, శ్రీపర్రు

'చాలా కాలంగా చేతినరాలకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నాను. ఇప్పటి వరకూ రెండు సార్లు వచ్చి వైద్యం చేయించుకున్నాను. మందులు వాడుతున్నాను. ఈ రోజు మళ్లీ వచ్చాను. డాక్టర్ లేరని చెబుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి చూపించుకునే స్తోమత లేదు. మళ్లీ మందులు రాయాల్సి ఉంది. పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.'

పక్షవాత సమస్యతో మందులు వాడుతున్నాను

సిహెచ్ మంగ, ఏలూరు

నోరు, చేయి, కాలు వంకర తిరగడం వంటి పక్షవాతపు సమస్యలతో మందులు వాడుతున్నాను. రోగం చాలా వరకూ తగ్గింది. మరోసారి చూపించుకుని మందులు రాయించుకుందామని వచ్చాను. డాక్టర్ లేరని చెబుతున్నారు. ఏంచేయాలో తెలియడం లేదు.

ఎంఎల్‌సి జయమంగళ రాజీనామా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ తన పదవికి శనివారం రాజీనామా చేశారు. ఎంఎల్‌సి పదవితోపాటు వైసిపి పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఎంఎల్‌సి పదవికి చేసిన రాజీనామా లేఖను శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు పంపించారు. 2024 జరిగిన ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమి పాలైంది. అప్పటినుంచి జయమంగళ వైసిపికి దూరంగా ఉంటూ వచ్చారు. ఎంఎల్‌సి పదవికి, వైసిపి పార్టీకి రాజీనామా చేయడం వైసికి మరో షాక్ తగిలినట్లు అయ్యింది.

యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి డ్వామా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమై పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లాలో 368 సిసి, బిటి, డబ్ల్యుబిఎంలు నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాల్సి ఉండగా 318 గ్రౌండ్ కాగా, ఇంకా మొదలు పెట్టని 50 పనులను వెంటనే చేపట్టి డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని మండలాల్లో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఏ మండలంలోనైనా వెండర్స్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతి కనబర్చకపోతే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. జిల్లా కలెక్టర్‌గా రోడ్ల నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. మండలాల వారీగా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. క్యాటిల్ షేడ్స్ సంబంధించి జిల్లాలో 965 నిర్మాణాలకు శాంక్షన్ ప్రతిపాదన చేయగా 666 పనులు వివిధ దశలలో ఉండగా ఇంకా మొదలు పెట్టని క్యాటిల్ షేడ్స్ పనులు వెంటనే మొదలుపెట్టి 2025 సంవత్సరం జనవరి 16 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డివిజన్, మండల స్థాయి ఇంజినీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఎంఎల్‌సిగా గెలిపించండి

టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - చింతలపూడి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా తనను గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి కోరారు. చింతలపూడి మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను, కళాశాలను ఆయన శనివారం సందర్శించారు. డిసెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను, అధ్యాపకులను కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పురేటి శ్రీనివాసరావు, మండల నాయకత్వం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గోపీమూర్తి

అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలి

భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు

ప్రజాశక్తి - భీమవరం

అవినీతి, అక్రమాలకు పాల్పడిన అదానీని అరెస్టు చేయడంతో పాటు, అదాని గ్రూప్‌తో చేసుకున్న విద్యుత్, మిగిలిన అన్ని ఒప్పందాలూ రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం ఆధ్వర్యంలో భీమవరం పోలీస్ బొమ్మ సెంటర్లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడారు. సెకి నుంచి రాష్ట్ర డిస్కాములతో విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదాని గ్రూపు భారీ ముడుపులు చెల్లించిన నేపథ్యంలో ఆ గ్రూప్‌తో చేసుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2019 -2020 మధ్య రాష్ట్రంలో పంపుడు స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్లు విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులు అదానీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ పద్ధతుల్లో భారీగా అదానీ ఆస్తులు సంపాదించారని విమర్శించారు. పార్లమెంట్ కమిటీ ద్వారా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడకపోవడం దారుణమన్నారు. వైసిపిపై ఆరోపణలు వచ్చినా స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికా కోర్టుకు అందించిన సమాచారంలో రాష్ట్రంలో ప్రముఖుల పేర్లు ఉండడం దారుణమన్నారు. వెంటనే వివరాల ద్వారా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు బి.వాసుదేవరావు, ఎం.వైకుంఠం, డి.నాగు, అప్పన్న, కె.కృష్ణ, డి.వీరబాబు పాల్గొన్నారు.

పెనుగొండ : అదానీ గ్రూప్ అవినీతిపై సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా అదానీపై కేసు నమోదు చేసి గౌతమ్ అదానీని, ఇతరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామ శాఖ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, మాదాసు నాగేశ్వరరావు, రాజమహేంద్రవరపు వెంకటేష్, శీలం ఏసు పాల్గొన్నారు.

ఆచంట : అదానీ గ్రూపు పాల్పడిన అవకతవకలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించాలని సిపిఎం మండల కార్యదర్శి పరువు మోహన రావు అన్నారు. ఆచంట కచేరీ సెంటర్లో శనివారం సాయంత్రం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం ప్రభుత్వం పెద్దలకు రూ.2,029 కోట్ల లంచాలు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. భారీ అవినీతిపై జెపిసితో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు టి.బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, కుసుమే జయరాజు, నేతలు బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, మన్నే బ్రహ్మేశ్వరరావు, తమరాపు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

గణపవరం : దేశ ప్రతిష్టను ప్రపంచ దేశాల్లో మంటగలిపిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యాన స్థానిక ఐ లాండ్ వద్ద చేపట్టిన రాస్తారోకోలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోలార్ విద్యుత్ కుంబకోణం అంశాన్ని అమెరికాలో న్యూయార్క్ కోర్టు ఆదేశాలు వెంటనే అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా అదానీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, ఎంపెంటారావు, ఎన్.రామకృష్ణ, పి.గోవిందు, చిన్నం చిన నాగేశ్వరరావు, పి.సత్యాంజనేయులు, ఎన్.సంజీవిరావు, మెంటే సూర్యారావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తణుకు : రాష్ట్ర సంపదను లూటీ చేస్తున్న అదానీని తక్షణం అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, అజయకుమారి మాట్లాడుతూ అదానీతో గత వైసిపి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల వల్లే ప్రజలపై రూ.17 వేల కోట్ల భారాలు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అదానీ అవినీతి సామ్రాజ్యం వెనుక మోడీ అండ దండలు పుష్కలంగా ఉన్నాయని విమర్శించారు.

తణుకులో..

కార్యక్రమంలో గార రంగారావు, గుబ్బల గోపి, కె.నాగరత్నం, రాజు, అంజిబాబు, సత్యనారాయణ, భాస్కరరావు పాల్గొన్నారు.

నరసాపురం : ముడుపులు చెల్లించి అక్రమ పద్ధతిలో పలు ఒప్పందాలు కుదుర్చుకుని అక్రమార్జనకు పాల్పడిన అదానీని అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో ఈ మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ అదాని గ్రూపు తయారు చేసే సౌర విద్యుత్తును డిస్కాములకు అందించడం, పోర్టులు ఏర్పాటు వంటి వాటిపై ఒప్పందాలు చేసుకున్న సందర్భంలో అదానీ గ్రూపు కొందరికి ముడుపులు చెల్లించి అవినీతికి పాల్పడిందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని అన్నారు. ముడుపులు తీసుకున్న ప్రభుత్వ నేతలు, అధికారుల పేర్లను బహిర్గతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నోముల కొండ, కేతినీడి వెంకటేశ్వరరావు, కోడి లక్ష్మణ్, కోరాడి బద్రి, పొన్నాడ మల్లేసు, బోడసింగ్ అప్పారావు పాల్గొన్నారు.

యలమంచిలి : దేశ విదేశాల్లో భారతదేశ పేరు ప్రఖ్యాతలను దిగజార్చిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. చించినాడ జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ అదాని అవినీతిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాతిరెడ్డి జార్జి,దేవ సుధాకర్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకటస్వామి, ఆకుమర్తి జోసెఫ్, పల్లేరు ఆనంద్, ముస్కుడి జయశ్రీ, చెట్టిమీ అనసూయ పాల్గొన్నారు.

యలమంచిలిలో..

నిత్యావసర ధరలను అరికట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఉండి

రోజు రోజుకీ విపరీతంగా పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు, వంట నూనెల ధరలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. శనివారం సిపిఎం 9వ మండల మహాసభ ఉండి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వీరవల్లి మాధవరావు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకట రత్నంల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహాసభలో తొలుత పార్టీ పతాకాన్ని ఎగురవేసి, ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి, ఆర్ఎస్, వలవల శ్రీరామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పిన మాటలు గాలికి వదిలేసి, ప్రజల్ని మోసం చేసిందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్ల మరమ్మతులు చేపట్టి టోల్ గేట్ పెట్టి, ప్రజల వద్ద డబ్బులు దండుకోవాలని చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆలోచనలు విరమించుకోవాలని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. ఇళ్ల స్థలాల లబ్ధిదారులందరికీ ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, తాగునీరు అందించే పంటకాలువలు, రక్షిత మంచినీటి చెరువులు, జలవనరులను ఆక్వా వ్యర్థ జలాల నుంచి కాపాడి మండలంలోని ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, ప్రజల ప్రాణాలను కాపాడాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రతి కుటుంబానికి 200 రోజులు కల్పించి, రోజుకి 400 రూపాయల వేతనం ఇవ్వాలన్నారు. పంట కాలువలు, మురుగు డ్రెయిన్లు ఆధునీకరించి పంటలు కాపాడాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. అనంతరం సిపిఎం ఉండి మండల నూతన కమిటీ 10 మందితో ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా చీర్ల శేషగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ధనికొండ శ్రీనివాస్, వీరవల్లి మాధవరావు, నిమ్మితి కిషోర్, రామకూరి వెంకటరత్నం, వీరవల్లి త్రిమూర్తులు, కింతాడ రమేష్, కొట్టాడ వెంకటేశ్వరరావు, చిప్పాడ బుచ్చేశ్వరరావు, వీరవల్లి వెంకట లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సిపిఎం మహాసభలలో జిల్లా నాయకులు మునుకోలు వైకుంఠరావు, నాయకులు కిలారి తవిటి నాయుడు, మాదాసి గోపి, వీరవల్లి శ్రీనివాస్, పెల్లూరి సుబ్రహ్మణ్యం, పడమటి ఆంజనేయులు, బొర్రా త్రిమూర్తులు, జుత్తిగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి - గణపవరం

ఇళ్ల స్థలాలు లేని పేదలకు స్థలాలు ఇచ్చి, ఇంటి రుణం రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబురావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బిటి రణదివే భవనంలో సిపిఎం 8వ మండల మహాసభ మండల నాయకులు ఎం.పెంటారావు, పి.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచనగా పార్టీ సీనియర్ నాయకులు విప్పర్తి సత్యం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీతారామ్ ఏచూరి, ఆర్ఎస్, పట్నాల శ్రీనివాస్ చిత్ర పటాలకు బాబురావు, పి.గోవింద్, నరాలశెట్టి రామకృష్ణ పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ విద్యుత్ స్మార్టు మీటర్ల పేరుతో ప్రజలకు మోయలేని భారాలు వేస్తుందని అన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయటంలో ప్రభుత్వం మీన వేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని అన్నారు. రైతులపై ప్రభుత్వాలకు ప్రేమ అనేది ఉంటే సబ్సిడీపై ఎరువులు, పురుగుల మందులు సొసైటీల ద్వారా ఇవ్వాలని, పంటమురుగు కాలవులు ఆధునికీకరణ చేయాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుద్ధి చేసిన మంచినీరు ప్రజలకందించాలని, లింకు రోడ్లు వెంటనే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. రెండు జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బిలి వంతెనను నిర్మాణం చేయాలని, కేశవరం ప్రజలకు ప్రధాన రహదారిగా ఉండి కాలువపై ఉన్న బెయిలీ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని తీర్మానించారు. కూటమి ప్రభుత్వం రోడ్లు, గుంతలు పూడ్చి రోడ్డుపై టోల్ ట్యాక్స్ వసూళ్లు చేయాలనే ఆలోచన దుర్మార్గ చర్యని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజాసమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని కోరారు. సోడదాసి సంజీవిరావు, చిన్నం చిన నాగేశ్వరరావు, కె.త్రినాథ్, కేతా శ్రీనివాస్ రావు, మెంటే సూర్యారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం కార్యవర్గ సభ్యులు బాబూరావు

అద్దేపల్లి దాతృత్వ సేవలు స్ఫూర్తిదాయకం : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు చరిత్రలో స్వాతంత్ర సమరయోధులు, విద్యాదాత, నిస్వార్థ ప్రజా సేవకులు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి దాతృత్వ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక గౌతమి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు ప్రతినెల నిర్వహించే కార్యక్రమంలో భాగంగా అద్దేపల్లి జయంతి ఉత్సవ వేడుకల సభలో ఆయన మాట్లాడారు. ముందుగా అద్దేపల్లి చిత్రపటానికి ఎన్‌డిఎ కూటమి నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. సేవా కార్యక్రమంలో భాగంగా వందవ రక్తదాన శిబిరంను జనసేన నాయకులు బోనం చిన్నబాబు ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. వీరిని మంత్రి రామానాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు అల్లూరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు, నేడు అద్దేపల్లి 125వ జయంతి వేడుకలు సంవత్సరం పాటు ప్రతి నెలా నిర్వహిస్తున్నామన్నారు. అద్దేపల్లి దాతృత్వం గురించి మాట్లాడుతూ విద్యా వ్యాప్తికి సొంత ఆస్తిని ధారపోసిన మహోన్నత వ్యక్త అని కొనియాడారు. పాలకొల్లులో ఆనాడు ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు రైస్ మిల్లును సైతం అమ్మి అవసరమైన స్థలం సమకూర్చిన విద్యా దాతగా అభివర్ణించారు. స్వాతంత్ర ఉద్యమ సమయంలో మున్సిపల్ ఛైర్మన్‌గా అద్దేపల్లి క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా మున్సిపల్ తీర్మానం చేసినందున ఆయన కౌన్సిల్‌ను బ్రిటిష్ పాలకులు రద్దు చేసినా.. ఎదురు నిలబడిన పోరాటయోధుడని మంత్రి అభివర్ణించారు. అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి అద్దేపల్లి గురించి భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఆయన జయంతి ఉత్సవాలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంవత్సరం పాటు జరుపుతున్నామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమంలో అలరించిన బాలికలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, బోనం చినబాబు, ఉన్నమట్ల కబర్ధి, పెచ్చేట్టి బాబు పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపికలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

డిసెంబర్ 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించబోవు పదవ అంతర జిల్లాల మెన్ అండ్ ఉమెన్ సీనియర్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల కోసం ఈనెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు మార్టేరులో సెలక్షన్స్ జరుగుతాయని యూత్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్(వైబిఎ) అధ్యక్షులు చిర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పశ్చిమగోదావరి జిల్లా టీంకు ఈ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరు కావాలని బాలాజీ రెడ్డి కోరారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా జయలక్ష్మి

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలుగా తెలుగు మహిళ మండల కోశాధికారి కర్రి జయలక్ష్మి శ్రీనివాస్‌ని ఎంపిక చేసినట్లు శనివారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ప్రతి మహిళ చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ద్వారా రుణాలు ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఉండి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎంపిక చేసిన ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు పరామర్శ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ తండ్రి సూర్యనారాయణరాజు మృతి చెందడంతో ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. భీమవరంలోని కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ నివాసం వద్ద సూర్యనారాయణ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భూపతిరాజు శ్రీనివాస్ వర్మను పరామర్శించిన ఎంఎల్‌ఎ బొలిశెట్టితో పాటు తాడేపల్లిగూడెం కూటమి నాయకులు ఉన్నారు.

భీమవరం టౌన్ : పితృ వియోగానికి గురైన కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, ప్రజలు పరామర్శించారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, గృహ మంత్రి నిమ్మల రామానాయుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహనరావు, తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, సీనియర్ రాజకీయ నాయకులు కనుమూరు బాపిరాజు, అన్నపూర్ణ దంపతులు, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఆయన సోదరుడు నరసింహరాజు, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), కోళ్ల నాగేశ్వరరావు శ్రీనివాస్ వర్మను పరామర్శించి, ఆయన తండ్రి సూర్యనారాయణ రాజుకు నివాళులర్పించారు.

అవినీతిలేని సుపరిపాలన అందించిన ఎన్‌డిఎ

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

అదానీ గ్రీన్ ఎనర్జీ కుంభకోణంపై చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందని, కొనసాగుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పితృవియోగమునకు గురికావడంతో ఆయనను పరామర్శించడానికి శనివారం భీమవరం వచ్చిన పురందేశ్వరి బిజెపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కంటంలో చక్రీసిఫుడులో బిజెపి ఇతర పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు, అదానీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాయని, కేంద్ర ప్రభుత్వానికి, బిజెపి ప్రభుత్వాలకు అదానీ గ్రీన్ ఎనర్జీతో, కుంభకోణాలతో ఎటువంటి సంబంధం లేదన్నారు. పార్లమెంట్ పురంధేశ్వరి తెలియజేశారు. ప్రధాని బిసి కులానికి చెందిన వ్యక్తి అని బిజెపి ప్రచారం చేసుకుంటుంది కదా అంటారు, బిసి కులగణన ఎందుకు చేయరని, బీహార్‌లో చేసిన మండల కమిషన్ సిఫారసులను ఆనాడు బిజెపి వ్యతిరేకించింది కదా అన్నదానికి పురందేశ్వరి స్పష్టంగా చెప్పలేకపోయారు. తమ ప్రధాని మోడీ బిసి అని చెప్పుకోవడానికి ఏమాత్రం సిగ్గుపడడం లేదని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు, తణుకు ఎంఎల్‌సి పక్కుర్తి, బిజెపి జిల్లా అధ్యక్షుడు నారిన తాతాజీ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట మానవత ఆధ్వర్యంలో కొడమంచిలి, వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సైకాలజిస్ట్, హిప్నోథెరపిస్ట్, వ్యక్తిత్వ వికాస నిపుణులు అక్కింశెట్టి రాంబాబు విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత అభివృద్ధి చెందేందుకు చిట్కాలు, చెడు వ్యసనాలపైన, జీవితంపై సానుకూలత సాధించేందుకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షులు కక్కెల లీలా ప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు తాళం శ్రీనివాస్, వల్లూరు సర్పంచి, నేల్లూరి బేబీ రామ్మోహన్ రావు, మానవత ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ, ఆర్థిక సహకార కమిటీ సభ్యులు కొమ్మోజు సూర్యనారాయణ మూర్తి శర్మ, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండాబత్తుల ఆనంద్ కుమార్, సంస్థ కోశాధికారి తమ్మిరెడ్డి సత్యనారాయణ మూర్తి, విలేజ్ కన్వీనర్ గణపాతుల రాంబాబు, ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మార్టేరులో మానవత సమావేశం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం మండల మానవత సంస్థ సమావేశం మార్టేరు కార్యాలయంలో జరుగుతుందని శాఖ అధ్యక్షులు, స్థానిక ఎస్‌జిజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిడి కర్రి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక మథర్ థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సాకారాబు, కర్రి మురళీ శ్రీనివాస రెడ్డి పాల్గొంటారని అన్నారు. స్థానిక పేద విద్యార్థికి చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందించనున్నట్లు, ఒక నిరుపేద వ్యక్తికి వైద్యం నిమిత్తం ఆర్థిక సాయం అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ధాన్యం తడవకుండా అన్నదాతలు జాగ్రత్తలు తీసుకోవాలి

తహశీల్దార్ కె.రాజకిషోర్

ప్రజాశక్తి - మొగల్తూరు

వాతావరణ మార్పుల ప్రభావంతో వర్షం కురిసినా ధాన్యం తడిసిపోకుండా అన్నదాతలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ కె.రాజకిశోర్ సూచించారు. శనివారం మొగల్తూరులోని ప్రైస్ మిల్లును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసుకుని రైతులకు రసీదులు అందజేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వచ్చాక ఎటువంటి ఆలస్యం చేయకుండా దిగుమతి చేసుకోవాలని సివిల్‌సప్లరు అధికారులను, మిల్లు గుమాస్తాలను ఆదేశించారు. వాతావరణంలో మార్పుల కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యం తడిసిపోకుండా బరకాలు కప్పడం లేదా సురక్షిత ప్రదేశంలో ఉంచేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులను రైతు సేవా కేంద్రాల నుంచి సంబంధిత అధికారుల ద్వారా పొందవచ్చునన్నారు. రైతులకు అవసరమయ్యే గోనెసంచులు అందించడమే కాకుండా ధాన్యం విక్రయించిన ప్రభుత్వం రైతుల ఖాతాలో జమచేస్తున్నదన్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఇప్పటి వరకు 1200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మిల్లు యజమానులు, ఛార్జీలు తెలిపారు. ఆయన వెంట విఆర్‌ఒ దూసనపూడి సత్యనారాయణ, విఆర్‌ఎ గణేష్ ఉన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం తగదు

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని 13, 25వ వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పర్యటించారు. అడ్వర్టైజ్‌మెంట్ పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించి మాట్లాడారు. పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పారిశుధ్య పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ తోట అరుణ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, సానిటరీ మేస్త్రి కిషోర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులు హాజరు పట్టికను పరిశీలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ విభాగం కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ విభాగం కోసం సెల్: 83339 88814

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

జాబ్ కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పనులు చూపాలని సిపిఎం బృందం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం మండలంలోని కలగంపూడి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడుతూ చాలా గ్రామాల్లో పనులు లేక కూలీలు ఇబ్బందులు పడే పరిస్థితి కనిపిస్తుందని, వారందరికీ ప్రభుత్వం పనులు కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలు వైద్య సేవలు పొందుతున్నారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు వెల్లడించారు. శనివారం పెదఅమిరంలో ఆయన ఇంటి వద్ద పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.14,85,066 సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం నిరంతరం పేదల అభివృద్ధికి పాటుపడుతుందన్నారు.

మరుగుదొడ్లు వాడుకుందాం..

ప్రజా ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

సర్పంచి సూర్య కుమారి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వాడుకొని, ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడాలని మాధవరం సర్పంచి ముప్పిడి సూర్యకుమారి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం మాధవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించారు. అనంతరం బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బి.ఫణికుమార్, గుమస్తా శ్రీనివాస్, ఎంఆర్‌సిఎం రవికిరణ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ దళాల ఫ్లాగ్ డే స్టిక్కర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

డిసెంబర్ 7వ తేదీన జరుగనున్న సాయుధ దళాల పతాక ఆవిష్కరణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ఈ ఏడాది ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆవిష్కరించారు. స్టిక్కర్లను, ఫ్లాగ్స్‌ను విద్యార్థులకు, ప్రజలకు సాయుధ దళాల పతాక విరాళాల సేకరణకు అందజేయడం జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో సాయుధ దళాల పతాక విరాళాలను విరివిగా సేకరించాలని సూచించారు. ఈ స్టిక్కర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి కెవిఎస్.ప్రసాదరావు ఉన్నారు.

పైపులైన్లు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని మల్లవరంలంక గ్రామానికి చెందిన ఉపసర్పంచి ఏలూరి కృష్ణాజి ఆధ్వర్యంలో 1, 2, 3, 4 వార్డుల్లోని ప్రజలకు తాగునీటి సరఫరాకు కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని శనివారం విప్, ఎంఎల్‌ఎ నాయకర్‌కు వినతిపత్రం అందించారు. పాత పైపులైన్ పగలిపోవడం వల్ల ప్రజలు నీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున జలజీవన్ పథకంలో కొత్త లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు డ్రెయినేజీలను నిర్మించాలన్నారు. పశువుల చెరువుకు పూడికతీత పనులు చేపట్టి ర్యాంపులు కట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సి.వెంకటేశ్వర్లు, కంబాల వెంకటేశ్వరావు, ఏలూరి వీరబాబు, కవురు శ్రీను, వేంద్ర బాలకృష్ణ, గోపాలకృష్ణ, హనుమంతు, విష్ణు, పెద్దిరాజు, అంజనేయులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల ప్యాంకింగ్‌పై +ఎఫ్ తప్పనిసరి

ప్రజాశక్తి - తణుకు

ప్రతీ ఆహార పదార్థాల ప్యాకింగ్‌పై ఖచ్చితంగా +ఎఫ్ అనే చిహ్నం ఉండాలని, ఈ చిహ్నం అర్థం బలవర్ధకమైన ఆహారం, సంపూర్ణ పోషణ ఇచ్చే ఆహారం అని నిర్ధారించారని జాతీయ వినియోగదారుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. శనివారం సౌత్ మెగా కన్స్యూమర్ ఎవేర్నెస్ క్యాంపెన్ కార్యక్రమంలో భాగంగా తణుకు తహశీల్దార్ కార్యాలయం వద్ద వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పాల ప్యాకెట్ పై విటమిన్ ఎ, విటమిన్ డి అనే చిహ్నం, ఉప్పు ప్యాకెట్స్‌పై ఐరన్, అయోడిన్, మైదా, గోధుమ పిండి, బియ్యం వంటి ప్యాకెట్‌పై విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్స్ వంటి వాటిని ఖచ్చితంగా ముద్రించి ఉండాలని తెలిపారు. వినియోగదారులు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా వినియోగదారుల సంఘ అధ్యక్షులు జి.నాగరామశంకర్, టిడిపి నాయకులు తాతపూడి మారుతీరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ గుర్తింపునకు క్రీడలు అవసరం : జెసి

భీమవరం : అంతర్జాతీయ స్థాయి గుర్తింపునకు క్రీడలు చాలా అవసరమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో 16వ ఈశా గ్రామోత్సవం రూరల్ ప్రీమియం లీగ్ (వాలీబాల్ పురుషులు, త్రో బాల్ స్త్రీలు)-24ను జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. వివిధ టీమ్‌లలో క్రీడాకారులను పరిచయం చేసుకుని, ఏ ప్రాంతం నుంచి వచ్చారని, యోగక్షేమాలను అడిగి తెలుసుకుని విజయం సాధించాలని ఆశీస్సులను అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఆహ్లాదాన్ని అందిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని యువత గుర్తించాలన్నారు. కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు) మాట్లాడుతూ క్రీడలకు తమ డిఎన్ఆర్ కళాశాల ఎల్లప్పుడు సహాయ, సహకారాలు అందిస్తూ, స్వాగతం పలుకుతుందని తెలిపారు. ఈశా ఫౌండేషన్ డాక్టర్ డి.విజయ, ఉపేంద్ర వర్మ, కెపి.వర్మ మాట్లాడుతూ మొదటి లెవల్(క్లస్టర్) మ్యాచ్‌లు రెండు రోజులపాటు పురుషుల వాలీబాల్, స్త్రీల త్రోబాల్ పోటీలు జరుగుతాయని తెలిపారు. వీటిలో గెలుపొందిన వారు రెండవ లెవల్‌లోకి అర్హత సాధిస్తారని, వాటిలో గెలుపొందిన వారు డిసెంబరు 28వ తేదీన కోయంబత్తూరులో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధిస్తారని తెలిపారు. ఫైనల్స్‌లో గెలుపొందిన వారికి రూ.5 లక్షల బహుమతి అందిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు), ఈశా ఫౌండేషన్ డాక్టర్ డి.విజయ, ఉపేంద్ర వర్మ, కెపి వర్మ, తహశీల్దార్ రావి రాంబాబు, కళాశాల పాలకవర్గ సభ్యులు కునపరాజు రామకృష్ణంరాజు, బివి.నరసింహరాజు, పిఇటి ఉపాధ్యాయులు, 45 టీమ్స్, పట్టణ ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

25న ఉచిత ధ్యాన యోగా శిక్షణ

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే మా లక్ష్యం : డాక్టర్ నాన్న(ప్రేమ్ నిరంతర్ గురూజి)

ప్రజాశక్తి - భీమవరం టౌన్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టర్ నాన్న

అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమని, దీనిలో భాగంగానే ఈనెల 25న అల్లూరి సీతారామరాజు సేవా సమితి వారి సౌజన్యంతో సకారాత్మ ఫౌండేషన్ సంకల్ప సమాధి యోగ, ఆధ్యాత్మిక ఆరోగ్య సేవా సంస్థ సిద్ధ ఆశ్రమం వారిచే ఉచిత ధ్యాన యోగ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని డాక్టర్ నాన్న(ప్రేమ్ నిరంతర్ గురూజి) తెలిపారు. శనివారం స్థానిక అల్లూరి సీతారామ సాంస్కృతిక కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఈనెల 24 సాయంత్రం 6 గంటలకు పరిచయ కార్యక్రమాన్ని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. ఈనెల 25 నుంచి ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7.15 నిమిషాల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం సెక్రటరీ చెరుకువాడ సుబ్రహ్మణ్యరాజు మాట్లాడుతూ సంపూర్ణ ఆనందం, ధ్యానం, యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ఆహారపు అలవాట్లు, జీవిత తత్వజ్ఞానం, ధ్యాన, యోగా శిక్షణ అందరూ నేర్చుకుని ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ ఉచిత ధ్యాన యోగా శిక్షణా తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీనివాస్(ఆదిత్య) మాట్లాడుతూ భీమవరం మున్సిపల్ వైస్ ఛైర్మన్, ఎఎస్ఆర్ నగర్ కౌన్సిలర్ ముదునూరి సూర్యనారాయణ రాజు, తట్టవర్తి నారాయణమూర్తి, ఎస్ఎస్‌వై మొదటి బ్యాచ్ సభ్యుల కోరిక మేరకు నాన్న సెకండ్ బ్యాచ్ మొదలు పెడుతున్నారని అన్నారు. దీని ముఖ్య ఉద్దేశం అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.దామోదర రావు, రామకృష్ణంరాజు, ఎంఎస్ఎన్.రాజు, జి.పద్మ, పి.పద్మావతి, ఎస్‌కె.బాబా, సుబ్రహ్మణ్య రాజు పాల్గొన్నారు.

రఘురామకృష్ణంరాజుకు అభినందనలు

ప్రజాశక్తి - కాళ్ల



రఘురామ కృష్ణంరాజును అభినందిస్తున్న కూటమి నాయకులు

ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి, ఉండి నియోజకవర్గం వచ్చిన సందర్భంగా ఆయన్ని నియోజకవర్గ కూటమి నాయకులు అభినందించారు. శనివారం పెదఅమిరం గ్రామంలోని ఆయన నివాసంలో పెద్ద ఎత్తున టిడిపి, జనసేన నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి జుత్తుగ నాగరాజు, మండల అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, మాజీ ఎంపిటిసి దంతులూరి శ్రీనివాసరాజు, గాదం నానాజీ, అల్లాడి శివన్నారాయణ, పిల్ల నరసింహరావు, ఆకివీడు టౌన్ కౌన్సిలర్లు, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు పాల్గొన్నారు.

విప్ పదవితో మరింత బాధ్యత

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విప్ పదవి ఇచ్చి మరింత బాధ్యత పెంచారని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు అఖండ మెజారిటీతో తనను ఎంఎల్ఎగా అసెంబ్లీకి పంపితే తాను సరైన అభ్యర్థిని అని నమ్మి జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాండేట్ ఇవ్వడం, దానికి టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కూటమిలో భాగస్వామి అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరికి, కూటమి నాయకులందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వంలో పశ్చిమగోదావరి జిల్లాకు ప్రముఖ స్థానం కల్పించారని, జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉంటే ఐదు మంది ఎంఎల్ఎలకు పదవులు ఇవ్వడం సాధారణ విషయం కాదన్నారు. అది కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. జిల్లాలోని ఎంఎల్ఎలంతా కష్టపడి కూటమి ప్రభుత్వానికి పేరు తీసుకురావడంతో పాటు జిల్లా ప్రజలకు అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వ ప్రాధాన్యత జిల్లాపై ఉన్నా, అభివృద్ధి కూడా అదే స్థాయిలో జరిగేలా చూసుకుంటామన్నారు.

ఆక్రమణలు తొలగించాల్సిందే !

వీరవాసరం : హైకోర్టు ఆదేశాలననుసరించి నవుడూరు ఆర్అండ్‌బి రహదారి వెంబడి ఉన్న ఆక్రమణలు తొలగించాల్సిందేనని ఎంపిడిఒ కిరణ్ కుమార్, ఆర్అండ్‌బి ఎఇ మూర్తి ఆక్రమణదారులకు స్పష్టం చేశారు. ఈమేరకు శనివారం నవుడూరు పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి మాణిక్యం అధ్యక్షతన ఆక్రమణదారులతో వ్యక్తిగత విచారణ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ కోర్టు ఆదేశాలను గౌరవించి ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. ఈ విచారణకు హాజరైన కొంతమంది ఆక్రమణదారులు మాట్లాడుతూ ఆర్అండ్‌బి రహదారి వెంబడి కొంతమంది ఆక్రమణదారులు షాపులు ఏర్పాటు చేసి గత కొన్ని సంవత్సరాలుగా లక్షల్లో అద్దె వసూలు చేసుకుంటున్నారని తెలిపారు. ఆక్రమణలు తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవన్నారు. అయితే సక్రమంగా హద్దులు నిర్ణయించి ఆక్రమణ తొలగించాలని అధికారుల్ని కోరారు. ఇప్పటికే ట్రాఫిక్ ఇబ్బందులతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం చోటు చేసుకుంటుదోనంటూ ఆక్రమణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి ఎఇ మాట్లాడుతూ ఇచ్చిన గడువు లోపు ఆక్రమణలు తొలగించని ఎడల కఠినంగా వ్యవహరించవలసి వస్తుందని ఆక్రమణ ఉద్దేశించి అన్నారు. 39 మందిని ఆక్రమణ దారులుగా అధికారులు గుర్తించగా అందులో కొంతమంది మాత్రమే ఈ విచారణకు హాజరైయ్యారు. ఈ విచారణలో విఆర్ఒ ప్రమీల, సర్వేయర్ రాజేష్, ఆక్రమణదారులు గుడాల సురేష్, జుత్తిగ లక్ష్మి, గుబ్బల సత్యనారాయణ, కదిరింది రామకృష్ణంరాజు, నెక్కంటి సూర్యనారాయణ, శివకేశవరావు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎక్సైజ్ సిఐ కళ్యాణ్ చక్రవర్తి

తాడేపల్లిగూడెం : ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీస్‌లు

తాడేపల్లిగూడెం : గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు మానవ జీవితానికి చేటు చేస్తాయని, వాటి వినియోగానికి దూరంగా ఉండాలని తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ కెఎస్‌వి.కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మత్తు పదార్థాల దుర్వినియోగం, నాటు సారాయి సేవించడం తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాల నిర్వహణలో భాగంగా తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం మత్తు పదార్థాల వినియోగం, సారా వినియోగం, పన్ను చెల్లించని మద్యం అక్రమ రవాణా, బెల్ట్ షాపుల నిర్వహణ తదితర అంశాలపై మండలంలోని పిప్పర గ్రామంలో అవగాహనా సదస్సును నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ మాట్లాడుతూ నాటు సారాయి వినియోగం, వాటి వల్ల కలిగే దుష్ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని చేయమని ప్రతిజ్ఞ చేయించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దొరబాబు పాల్గొన్నారు.

తణుకు : గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల మానవుల ఆరోగ్యం క్షీణించి, మరణానికి దారితీసే పరిస్థితులు ఏర్పడతాయని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి అన్నారు. శనివారం తణుకు పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కళాశాలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ ఆర్.మధుబాబు, హెడ్ కానిస్టేబుల్ జి.ఫణిభూషణ్‌లు పాల్గొన్నారు.

పాలకొల్లు : ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణంలోని ఎన్ఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల మానవుల ఆరోగ్యం, మానసిక స్థితిపై కలిగే చెడు ప్రభావాలు, సమాజంపై అవి ఎటువంటి దుష్ప్రభావాలు కలిగిస్తున్నాయి, డ్రగ్స్ వ్యసనం ఏవిధంగా అలవాటు పడుతుంది వివరించారు. పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రఘు పాల్గొన్నారు.

తాగునీరు రెండు పూటలా అందించాలి

భీమవరం : రక్షిత మంచినీటిని రెండు పూటలా పుష్కలంగా అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య పనులు వేగవంతం చేసి ప్రజలకు వాడుకలోకి తేవాలన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో ప్రజలు సంతృప్తిని పొందే స్థాయిలో ఉండాలన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో గ్రామ నీరు సరఫరా, పారిశుధ్యం, జలజీవన్ మిషన్, అంగన్వాడీ సెంటర్లు, టాయిలెట్స్, అంగన్వాడీ సెంటర్లలో మంచినీటి సదుపాయం, ఒహెచ్ఎస్ఆర్ నిర్మాణాలు, రిపేర్లు, ఫిల్టర్లు రీప్లేస్మెంటు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి సమావేశం నిర్వహించారు. జరుగుతున్న పనులపై మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ఒహెచ్ఎస్ఆర్‌లు 998 పనులకు గాను 554 పూర్తికావడం పట్ల కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేస్తూ వివిధ దశల్లో ఉన్న మిగిలిన వాటిని మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో అంగన్వాడీ సెంటర్లో 150 మరుగుదొడ్లకు గాను 20 మాత్రమే పూర్తి చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, మిగతావి డిసెంబరు 31వ తేదీ నాటికి నూటికి నూరు శాతం పూర్తి అవ్వాల్సిందేనని ఆదేశించారు. అంగన్వాడీ సెంటర్లో 138 మంచినీటి పథకం పనులు 75 పూర్తి అయ్యాయని, మిగతావి డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ సెంటర్లు, టాయిలెట్సు 150 పనులకు 20 పూర్తి అయ్యాయని, మిగతావి డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు, శానిటేషన్ బాగుంటే ఆరోగ్యకరమైన గ్రామాలు ఏర్పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి బివివి.నాగేశ్వరరావు, జిల్లా ఐసిడిఎస్ నోడల్ అధికారి పి.విజయలక్ష్మి, ఇఒ సిహెచ్.సుజాత లక్ష్మి పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్, క్వాటర్స్ నిర్మాణాలు పూర్తి చేయాలి

కలెక్టర్ నాగరాణి

భీమవరం : భీమవరం కోర్టు కాంప్లెక్స్, న్యాయమూర్తుల క్వార్టర్స్ నిర్మాణం, మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి, మూడవ అడిషనల్ జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం.ఎ.సోమ శేఖర్ సంయుక్తంగా జిల్లా కోర్టు భవన నిర్మాణం, న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్ మరమ్మతులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరంలో రూ.85.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణంలో ఉన్న కోర్టు కాంప్లెక్స్, భీమవరం, తణుకు పట్టణాల్లోని న్యాయమూర్తుల నివాస క్వార్టర్స్ మరమతులు, తణుకు అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి నివాస క్వార్టర్స్, తదితర పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్ అండ్ బి అధికారులు కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలన్నారు.రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా రోడ్లు, భవనాలు శాఖ ఇఇ ఎ.శ్రీనివాసు, డిఇలు పివి.రామరాజు పాల్గొన్నారు.

నరసాపురం లేస్‌కు అంతర్జాతీయ గుర్తింపు : కలెక్టర్

భీమవరం : నరసాపురం లేస్‌కు భౌగోళిక సూచిక(జిఐ) ఎంపికతో అంతర్జాతీయ గుర్తింపు సాధించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రత్యేక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెట్ లింకేజి, బ్రాండింగ్ ప్రమోషన్ లక్ష్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతీయ టెక్స్టైల్ పరిశ్రమలో ముఖ్య భాగంగా, చేతితో నేసిన, చేతితో తయారు చేసిన వస్త్రాలు దేశంలో భౌగోళిక సూచిక, నమోదిత ఉత్పత్తుల పట్టికలో అగ్రగామిగా ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఎంపిక చేసిన 8 జౌళి చేతి ఉత్పత్తుల్లో నరసాపురం లేసు కూడా జిఐ గుర్తింపు లభించిందన్నారు. జిఐ, పోస్ట్ జిఐ ఇనిషియేటివ్‌లపై చర్చించడం, ఈ ప్రత్యేకమైన ఉత్పత్తుల అభివృద్ధికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేయడం వర్క్‌షాప్ ప్రధాన లక్ష్యం అన్నారు. అంతర్జాతీయ గుర్తింపుతో పాటు, రాష్ట్రంలో జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తుల్లో ఒకటిగా నిలవడానికి కారణమైన తయారీదారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఫసల్ బీమా యోజనపై అవగాహన

నరసాపురం: రైతులకు ఎంతగానో ఉపయోడపడే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఎడిఎ ఇ.అనిల్ కుమారి అన్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం సచివాలయ వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు ఎకరానికి ఏడాదికి రూ.615 చెల్లిస్తే ప్రభుత్వ పరంగా అనేక సదుపాయాలు పొందవచ్చునన్నారు. ఎఒ శామ్యూల్ జాన్సన్, సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మూడునెలల లోపు పింఛన్లు..

ఆకివీడు : సామాజిక పింఛన్లు మూడు నెలల లోపు తీసుకోవచ్చునని ఆకివీడు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎ.శ్రీకర్ తెలిపారు. ఏవిధమైన అనారోగ్య కారణాలు, ఇతరత్రా సమస్యల కారణంగా రెండు నెలలు పింఛన్ తీసుకోకపోయినా లబ్ధిదారులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మూడో నెల పింఛన్‌తో కలిపి మొత్తం మూడు నెలల్లో తీసుకోవచ్చునని తెలిపారు.

మహారాజశ్రీ కొవ్వూరు IX Addl. డిస్ట్రిక్ట్ జడ్జి వారి కోర్టులో

I.A. 370/2024
A.S. /2024
S.R. 1121/2024

Between:
పిటీషనర్లు/ (Appellants):
1. Smt. Nuthangi Chandra Leela
2. Kum. Nuthangi Sirisha
AND
రెస్పాండెంట్లు:
Tadigadapa Seetha Ramamma and 8 Others
To:
4. Nuthangi Sesha Pavan Kumar, S/o. Alleged Jeevamadhuram, Gantavari Street, Chintalapudi, Chintalapudi Mandal, West Godavari District, now at Present Eluru District.

పై నెంబరులోని పిటీషనర్లు (అప్పిలెంట్లు) మీ వగైరాలపై అప్పీలు దాఖలు చేసుకొని సదరు అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 555 days Delay Condone చేయించమని పై నెంబరున పిటీషను దాఖలు చేసుకొని యున్నారు. సదరు పిటీషనులో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు ది. 05-12-2024వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించడమగును.

M/s. G.RAMAKRISHNA
K.BALA RAMARAJU
MADDIPATI SRINIVAS
Advocates, Kovvur

డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింట్ దాయన ఏడుకొండలు, తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు, 11వ వార్డు, సత్యవతినగర్, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా వారు ఇచ్చిన సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ దాయన ఏడుకొండలు తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు గారు ది.11-11-2024 సం.తేదీన జిరాక్స్ నిమిత్తం నా క్లయింట్ ఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ (దస్తావేజు నెంబర్లు : 1843/1982, 4846/1988, 3387/1996, 96/1997) గల ఇంటికి సంబంధించిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్స్ తీసుకొని ఇంటి వద్ద నుండి సాయంత్రం సుమారు 6 గంటలకు మోటార్ సైకిల్‌పై క్యారీ బ్యాగ్‌తో తాలుకాఫీస్ సెంటర్‌కు బయలుదేరుగా, మార్గమధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిననూ, ఎంక్వైరీ చేసిననూ దొరకలేదు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు ఇంటికి సంబంధించిన పై తెలిపిన ఒరిజినల్ లింక్ దస్తావేజులు ఎవరికైనా దొరికన యెడల ఈ క్రింది నా క్లయింట్ అడ్రస్‌కి గాని, నాకు గాని తెలియజేయగలరు.

నా క్లయింట్ చిరునామా : దాయన ఏడుకొండలు, తండ్రి దాయన (లేటు) వెంకటేశ్వరరావు, 11వ వార్డు, సత్యవతినగర్, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా.

కంకట శ్రీనివాసరావు, అడ్వకేట్, కొండ్రుప్రోలు, తాడేపల్లిగూడెం మండలం. సెల్: 9989524989